## ఇంజినీరింగ్ కళాశాలల్లో

● బోగస్ బోధకుల కట్టడికి యోచన

# అధ్యాపకుల ఫొటోలు

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ కళాశాలల్లో బోగస్ అధ్యాపకులను నియంత్రించేందుకు అక్కడ పని చేసే అధ్యాపకుల ఫొటోలను ఆయా ప్రాంగణాలు, విభాగాల వద్ద ప్రదర్శించాలని జేఎన్‌టీయూహెచ్ యోచిస్తోంది. ముఖ్యంగా పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో కొందరు అధ్యాపకులు రికార్డుల్లో మాత్రమే ఉంటున్నారని... మరికొందరు కేవలం బయోమెట్రిక్ హాజరు వేసి వెళ్తుంటారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. బోగస్ అధ్యాపకులను అరికట్టేందుకే కొన్నేళ్లుగా బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తోంది. కొందరు బయోమెట్రిక్ హాజరు వేసి వెళ్లిపోతున్నారని ఇందుకు కళాశాలల యాజమాన్యాలు నెల నెలా కొంత వేతనం చెల్లిస్తున్నాయని ఆరోపణలున్నాయి. దీనికి కూడా చెక్ పెట్టేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫొటోలు ప్రదర్శిస్తున్నట్లు కళాశాలల్లో కూడా అధ్యాపకుల ఫొటోలు ఉండేలా చర్యలు చేపట్టాలని జేఎన్‌టీయూహెచ్ యోచిస్తోంది.



ఒకవేళ ఫొటోల్లోని అధ్యాపకులు పాఠాలు బోధించడానికి రాకుంటే విద్యార్థులు ఫిర్యాదు చేయొచ్చు. విద్యార్థులు నష్టపోకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు.

### జనవరి 7, 8 తేదీల్లో సిలబస్‌పై మేధోమథన సదస్సు

అన్ని యూనివర్సిటీల పరిధిలో డిగ్రీలో కామన్ సిలబస్‌ను అమలు చేయడం అలాగే డిగ్రీ( బీఏ, బీకాం, బీఎస్సీ), ఇంజినీరింగ్ సిలబస్‌లో మార్పులు చేర్పులు చేసేందుకు ఉన్నత విద్యా మండలి నాలుగు కమిటీలను నియమించింది. జేఎన్‌టీయూహెచ్ గత మూడు నెలల నుంచే ఇంజినీరింగ్ సిలబస్‌ను మార్చేందుకు కసరత్తు చేస్తోంది. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఇటీవల జేఎన్‌టీయూహెచ్ ఇన్‌ఛార్జి వీసీగా రావడంతో ఇంజినీరింగ్ సిలబస్‌పై మేధోమథనం చేసేందుకు జనవరి 7, 8 తేదీల్లో సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. తొలిరోజు 100 మందితో ఇండస్ట్రీ- అకడమిక్ మీట్ పేరిట నోవాటెల్ హోటల్‌లో సమావేశం ఉంటుందని, అందుకు వ్యయం ఐఐటీ మద్రాస్ భరిస్తుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. రెండో రోజు దాదాపు 1,200 మందితో సిలబస్‌పై చర్చ ఉంటుందని, అన్ని ప్రైవేట్ కళాశాలల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, వారి సూచనలు సలహాలు తీసుకుంటామని చెప్పారు. ఐఐటీ మద్రాస్ బృందం కూడా హాజరై సూచనలిస్తుందని తెలిపారు.

### కొత్త కళాశాలల్లోని విద్యార్థులకు జేఎన్‌టీయూహెచ్ నుంచి ఆన్‌లైన్ పాఠాలు



జేఎన్‌టీయూహెచ్ పరిధిలో 144 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు హైదరాబాద్ క్యాంపస్ బయట సుల్తాన్‌పూర్, జగిత్యాల, మంథని పాత కళాశాలలుకాగా... వనపర్తి, సిరిసిల్ల, పాలేరు, మహబూబాబాద్‌లలో కొత్తగా ఏర్పాటు చేసిన కళాశాలలున్నాయి. కొత్త వాటిల్లో శాశ్వత బోధనా సిబ్బంది లేరు. కాంట్రాక్టు అధ్యాపకులను నియమించుకుందామన్నా ప్రభుత్వం నుంచి అనుమతి లేదు. అయినా అక్కడి విద్యార్థులు నష్టపోరాదని జేఎన్‌టీయూహెచ్ నుంచి వారంలో ఒకటి రెండు రోజులు ఆన్‌లైన్ లైవ్ పాఠాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బాలకిష్టారెడ్డి తెలిపారు. వర్సిటీలో ఇప్పటికే లైవ్ పాఠాలను రికార్డు చేసేందుకు, ప్రసారం చేసేందుకు స్టూడియో ఉంది. అందులో ఆచార్యులు పాఠాలు చెబుతుంటే ప్రత్యక్షంగా నాలుగు కళాశాలల విద్యార్థులు వినొచ్చు...సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన చెప్పారు. స్టూడియోలోని కెమెరాలు పనిచేయడం లేదని, కొన్ని లక్షలు రూపాయలు ఖర్చు చేస్తే సరిపోతుందని తెలిపారు.